క్లుప్తంగా

పేదలకు దుస్తులు, నిత్యావసరాల పంపిణీ



చిలకలూరిపేట: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని స్థోమత గలిగిన ప్రతి ముస్లిం దానధర్మాలు చేయాలని సనా ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మొహమ్మద్ యూసుఫ్ ఆలి పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసం వద్ద రంజాన్ పండగను సందర్భంగా 700 మంది ముస్లింలు, నిరుపేదలకు రూ. 7 లక్షలు విలువైన దుస్తులు, నిత్యావసరాలు ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు మొహమ్మద్ కరీమా, డాక్టర్ అబ్దుల్ బాసిత్, ఒయాసిస్ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ, ఇన్నర్ వీల్ సభ్యులు డాక్టర్ ప్రఫుల్లాదేవి, అబ్దుల్ రహీం, షేక్ నజీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి



నకరికల్లు: ఆధునిక వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో వ్యవసాయ విద్యార్థులచే ఆదివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్లలోని వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు రైతులతో మాట్లాడారు. గ్రామంలోని పంటలను పరిశీలించారు. అనంతరం సచివాలయం ప్రాంగణంలో గ్రామ పటం, పంటల సమస్యల వృక్షం, వృత్తి విలయం రంగులతో గీసి రైతులకు అవగాహన కల్పించారు. అందుబాటులో ఉన్న వంగడాలు, వాటి ధరలు వివరించారు. ఈ సందర్భంగా ఏవో దేవదాసు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సిబ్బందితో తరచూ మాట్లాడుతూ సాగులో వచ్చే సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కార మార్గం తెలుసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం విద్యార్థినికి నవోదయలో సీటు



రాజుపాలెం: స్థానిక నవోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న జల్లిపల్లి శ్రావ్య జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో సీటు సాధించింది. మద్దిరాలలోని జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి గాను ఇటీవల రాసిన పరీక్షలలో మెరుగైన మార్కులు సాధించి ప్రవేశం పొందింది. విద్యార్థినికి ఎంఈవోలు మల్లిఖార్జున శర్మ, నర్సింహారావు, ప్రిన్సిపాల్ పత్తి రామారావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

హోంగార్డు సుభానికి అభినందనలు



బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు వద్ద హోంగార్డు సుభాని ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అరబిందో ఫార్మా కంపెనీ ఆపరేషన్స్, ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రెసిడెంట్ పీ శ్రీనివాసరెడ్డి అభినందించారు. మండలంలోని దమ్మాలపాడు గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చిన శ్రీనివాసరెడ్డి హోంగార్డు సుభాని చలివేంద్రాన్ని సందర్శించి అందిస్తున్న సేవలను పరిశీలించారు. ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్న సుభానిని ఆదర్శంగా తీసుకొని సేవాభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కళ్ళం కోటిరెడ్డి, వీరారెడ్డి, మీరావలి స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీరు పంపిణీ

రాజుపాలెం: తాగునీటి సమస్యను అరికట్టేందుకు వేసవి పూర్తయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని పంపిణీ చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని తెలిపారు. మండలంలోని కొండమోడు పరిధిలోని పార్వతీపురంలో తాగునీటి సమస్య ఉన్నట్లు స్థానికులు అధికారుల దృష్టికి తెచ్చారు. దీంతో ఆదివారం పార్వతీపురం చేరుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బోర్లు ఎండిపోయినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఏఈ భవాని మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సమస్యను అరికట్టేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో రెండు నీటి ట్యాంకుల ద్వారా తాగునీటి పంపిణీని ఆదివారం నుంచి ప్రారంభినట్లు తెలిపారు. కొండమోడు, పార్వతీపురం ప్రాంతాలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉచిత తాగునీటిని పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పుడమిపై పునరుత్థానుడై

- ఘనంగా ఈస్టర్ వేడుకలు
- పెద్దల సమాధుల వద్ద విశ్వాసుల ప్రత్యేక ప్రార్థనలు



సమాధుల తోటలో ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: ఏసుక్రీస్తు పునరుత్థాన పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ విశ్వాసులు క్రిస్టియన్‌పాలెంలోని సమాధుల తోటలో తమ పెద్దల సమాధులను అందంగా అలంకరించి, ప్రార్థనలు జరిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇక్కడ నిర్వహించిన ఈస్టర్ వేడుకలకు హాజరై, శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు ఏసు బోధనలు ప్రపంచ మానవాళికి అవసరమని, అవి శాశ్వతంగా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కాకుమాను మంగపతిరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ కందుల ఎజ్రా, మాల మహానాడు అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ పాల్గొన్నారు.

● **శావల్యాపురం:** మండల కేంద్రంలోని విమోచన ప్రార్థన మందిరంలో మత బోధకులు సీహెచ్ యేహెజ్కేలు ఏసుక్రీస్తు పునరుత్థానుడైన రోజు ఈస్టర్ పర్వదినంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. మానవుని జీవితం మరణంతో ముగింపు కాదని.. తదుపరి ఉన్నతమైన జీవితం ఉందని ఏసుక్రీస్తు బోధనలను వివరించారు. సోమేపల్లి వెంకటేశ్వర్లు, ప్రేమ్‌కుమార్, రాక్ ప్రశాంత్, కస్తూరి, పోలా అరుణ, బత్తుల కృపమ్మ, అంబోరు రేచల్, కీర్తన, నిశాంత్ ప్రశాంత్ పాల్గొన్నారు.

● **ఈపూరు:** ఈస్టర్ పర్వదిన వేడుకలు మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని లూథరన్ చర్చిలో పాస్టర్ జాన్ మోజేస్ దైవ సందేశమిచ్చారు. ఈస్టర్ ప్రాముఖ్యతను విశ్వాసులకు వివరించారు. ఏసుక్రీస్తు మానవాళి పాపపరిహారానికి భూలోకానికి వచ్చి మరణించి.. పునరుత్థానుడయ్యాడని తెలిపారు. అనంతరం భక్తులు భక్తిగీతాలు ఆలపించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● **వినుకొండ(నూజెండ్ల) :** ఈస్టర్ పర్వదిన వేడుకలు పట్టణం, వినుకొండ రూరల్‌లోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హోసన్న ప్రార్థన మందిరం, ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి, జీవాలయం తదితర చర్చిల్లో జరిగిన వేడుకల్లో పాస్టర్లు దైవసందేశమిచ్చారు. ఈస్టర్ ప్రాముఖ్యతను వివరించారు. భక్తులు భక్తి గీతాలు ఆలపించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హోసన్న ప్రార్థన మందిరంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● **నాదెండ్ల:** ఈస్టర్ పర్వదినం మండలంలోని అన్ని చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా చర్చిల పాస్టర్లు ఏసుక్రీస్తు పునరుత్థానం, ఆయన బోధనలు వివరించారు. గణపవరం హెబ్రోను ప్రార్థన మందిరంలో పాస్టర్ యడ్లపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు జరిపారు. తూబాడులోని పురాతన పునీత వనచిన్నప్ప చర్చిలో పాస్టర్ కాకుమాను మిల్కిన్ రాజు ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. ఆయా చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

చిలకలూరిపేట: ఏసు పునరుత్థానం లోకానికి శుభకరమని, చెడుపై మంచి సాధించిన విజయం ఈస్టర్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. ఈస్టర్ పండగను పురస్కరించుకొని తండ్రి సన్నిధి మినిస్ట్రీస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. మనోహర్ నాయుడుకు బ్రదర్ షాలేము రాజు ఆశీస్సులు అందించారు.



ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు



ప్రత్యేక ప్రార్థనలో భక్తులు



ఈపూరు లూథరన్ చర్చిలో దైవసందేశమిస్తున్న పాస్టర్ జాన్ మోజేస్



పెద్దల సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న విశ్వాసులు



హోసన్న మందిరంలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



గణపవరంలో హెబ్రోను మందిరంలో భక్తుల ప్రార్థనలు

ముగిసిన వడ్డీ రాయితీ పన్ను చెల్లింపు గడువు

- అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న బకాయిదారులు
- స్వయంగా పన్ను వసూలు చేసిన మున్సిపల్ కమిషనర్
- అధిక సంఖ్యలో స్పందించిన పన్నుదారులకు ధన్యవాదాలు



స్వయంగా పన్ను వసూలు చేస్తున్న కమిషనర్, రెవెన్యూ అధికారులు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీతో పన్ను చెల్లింపు సౌకర్యాన్ని పలువురు పన్నుదారులు వినియోగించుకున్నారు. ఆదివారం గడువు ముగియడంతో.. కొన్ని బకాయిలకు సంబంధించి నేరుగా మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి రంగంలోకి దిగారు. రెవెన్యూ అధికారులతో కలిసి బకాయిదారుల వద్దకు వెళ్లి మాట్లాడారు. వారితో పన్ను కట్టించి వెంటనే రసీదు ఇచ్చారు. కొంతమంది వార్డు సచివాలయ సెక్రటరీలను స్వయంగా ఇంటికి పిలిచి, పన్ను చెల్లించినట్లు కమిషనర్ తెలిపారు. వడ్డీ రాయితీతో పన్ను చెల్లించిన వారందరికి ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. పురపాలక శాఖ అధికారులతో పన్ను వసూలుకు పలు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వారు ఇంటి వద్దకు వచ్చినప్పుడు నగదు చెల్లించి, తగు రసీదు పొంది పురపాలక సంఘానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ షేక్ అబ్దుల్ జబ్బార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి
- గణపవరంలోని పార్టీ శ్రేణులతో సమావేశం



సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి కావటి, పార్టీలో చేరిన కౌన్సిలర్ తులం సుధాకర్

నాదెండ్ల: 'మీ కుటుంబంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్ల మేలు జరిగిందని భావిస్తేనే.. ఓటు వేయండి.' అని అడుగుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. శనివారం ఆయన గణపవరం గ్రామాన్ని సందర్శించారు. మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు నివాసం వద్ద కార్యకర్తలు, నాయకులు, పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా బొడ్డురాయి వద్ద, గంగమ్మ గుడి, కోదండరామాలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. గ్రామానికి రూ.77.96 కోట్లు అభివృద్ధి, సంక్షేమం అందించినట్లు చెప్పారు. 30 ఎకరాల విస్తీర్ణంలోని జగనన్న కాలనీలో 1,224 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించామన్నారు. 1,155 మందికి ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందజేసినట్లు చెప్పారు. నాడు – నేడులో భాగంగా ఒక్క జెడ్పీ ఉన్నత పాఠశాలలోనే 12 అదనపు గదుల నిర్మాణం, అభివృద్ధికి రూ.2 కోట్ల మేర నిధులు వెచ్చించినట్లు వెల్లడించారు. స్థానికంగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని కావటి చెప్పారు. సమస్యలను పరిష్కరిస్తూ చిలకలూరిపేట అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. రాజీవ్‌గాంధీ కాలనీ వాసులకు శ్మశాన వాటికకు ప్రభుత్వం నుంచి స్థలం కేటాయించేలా ప్రయత్నిస్తానన్నారు. తనను, నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను ఓట్లు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు షేక్ ఆదంవలి, పిల్లి సాగర్‌బాబు, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, మార్కెట్ యార్డు చైర్మన్‌గొంటు శ్రీనివాసరెడ్డి, రాజాయాదవ్, మూడో వార్డు ఇన్‌చార్జి కాటా వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, మాజీ సొసైటీ అధ్యక్షుడు కాటా రత్తయ్య, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ బొప్పూడి రామారావు, పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, నాయకులు పెనుమల భీమయ్య, మండలనేని వెంకటేశ్వరరావు, బొంతా బాబు, పోతురాజు, ఎం.సుబ్బారావు, తాళ్లూరి ప్రభుదాసు, వెంకన్న, ఆముదాలపల్లి ఆంజనేయులు, చల్లగుండ్ల రామారావు, గాదె హనుమంతరావు, కె నాగయ్య, ఎ సుబ్రహ్మణ్యం, రహంతుల్లా పాల్గొన్నారు.

బీసీలు వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి



పార్టీలో చేరిన వారితో వైఎస్సార్‌సీపీ నాయకులు

శావల్యాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలందరూ ఐక్యతగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరలా సీఎంగా ప్రమాణ స్వీకారం చేయించాలని రాష్ట్ర ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ అధ్యక్షుడు కోర్నా వెంకట నారాయణ ముదిరాజ్ అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో బీసీ వర్గీయులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎంపీ అభ్యర్థి డాక్టరు పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడును అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 139 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ అంటేనే బడుగు బలహీన వర్గాల పార్టీ అన్నారు. అనంతరం గ్రామంలో 10 కుటుంబాలకు చెందిన బీసీ కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీ చేరాయి. వారికి పార్టీ కండువాలు కప్పి ఘనంగా స్వాగతించారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు దేవనబోయిన వీరనారాయణ, మండల అధ్యక్షుడు భీమని అంకారావు, ఎంపీటీసీ సభ్యులు దేవనబోయిన పోతురాజు, గ్రామ సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ ఏసురాజు, మండల కో–ఆప్షన్ సభ్యులు దూదేకుల హుస్సేన్, మైనారిటీ సంఘం అధ్యక్షుడు దూదేకుల పెద మదార్, జవంగుల బాబు, కొణతం ఏరుకలరెడ్డి, ఈశ్వరయ్య, కొండారెడ్డి, పొట్టిపాటి శ్రీను, కొంగల వాసుముదిరాజ్, పార్టీలో చేరిన వారు సుత్తినేడి కొండయ్య, మీరావలీ, మౌలాలి తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగేంద్రస్వామి తిరునాళ్ల

సత్తెనపల్లి: మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో నాగేంద్రస్వామి వారి తిరునాళ్ల ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలంలోని నీలగంగవరం గ్రామం నుంచి 10 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంచి చేయడం వల్లే.. పార్టీలోకి చేరికలు పెరిగాయన్నారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పార్టీలో చేరిన వారికి ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరింత సంక్షేమం అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేటీ కాలనీ అభివృద్ధికి కృషి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- వైఎస్సార్ సీపీలో 20 కుటుంబాల చేరిక
- ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

నరసరావుపేట: చిలకలూరిపేట రోడ్డులోని ఎస్ఆర్‌కేటీ కాలనీని ఆదర్శంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నా రు. ఆదివారం సాయంత్రం కేసానుపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామ నాయకుడు మారూరి శివారెడ్డి ఆధ్వర్యంలో ఆ కాలనీలోని టీడీపీకి చెందిన 20 కుటుంబాల వ్యక్తులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. తొలుత రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని, ముస్లింలకు విందు వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీలో మంచినీటి, విద్యుత్, డ్రెయినేజీ సమస్యలను చాలా వరకు పరిష్కారించినట్లు చెప్పారు. ఇటీవల కాలనీలో సీసీరోడ్లు వేశామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీటిని కొళాయిల ద్వారా అందించినట్లు తెలిపారు. ఈ అభివృద్ధిని చూసి కాలనీ పరిధిలోని జానీబీ వర్గీయులు 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరటం చాలా సంతోషంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న డాక్టర్ పి.అనీల్‌కుమార్‌యాదవ్, తనను కాలనీ ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథార్టీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్ బాష, షేక్ జానీబీ, నాయకులు బాష, ఇనుముల సాంబిరెడ్డి, గోతాల బాజి, న్యాయవాది శివకోటి కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులం ఏకమై.. దీనుల పార్టీని గెలిపించుకుందాం

వైఎస్సార్ సీపీ దివ్యాంగుల రాష్ట్ర విభాగ అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజు



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని కలిసిన దివ్యాంగుల విభాగ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌రాజు

నరసరావుపేట: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చి, ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ పి.అనీల్‌కుమార్‌యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విజయానికి దివ్యాంగులందరం కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగ రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం ప్రకాష్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మూడు జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్ కొమ్మిరెడ్డి శివారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కర్నాటి కృష్ణమూర్తితో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. జగనన్న సైన్యంలో భాగమైన దివ్యాంగులందరూ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి హ్యాట్రిక్ విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో దివ్యాంగులకు ఎటువంటి ప్రయోజనం లభించలేదన్నారు. టీడీపీ, జనసేన నాయకులు వలంటీర్ల వ్యవస్థపై విషప్రచారం చేసి, అవ్వాతాతలు, మహిళలకు ఇంటి వద్దకే పింఛన్ అందకుండా చేశారన్నారు. గతంలో దివ్యాంగులు ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు పడి పింఛను తీసుకోవాల్సివచ్చేదన్నారు. రీజినల్ కో–ఆర్డినేటర్ శివారెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పెత్తందార్ల పార్టీపై పేదల పార్టీ అయిన వైఎస్సార్ సీపీ పోటీచేస్తుందన్నారు. 40ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు తన కంటే చిన్నవాడైన సీఎం జగన్‌ను ఎదుర్కొనేందుకు పవన్ కల్యాణ్‌ను అరువు తెచ్చుకున్నాడన్నారు. ఎన్నికల ప్రచారంలో ఉన్న జగన్ సభలకు మండుటెండలో కూడా లక్షల మంది ప్రజలు హాజరవుతున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్యే గోపిరెడ్డి తన సొంత నిధులతో 300మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు, వీల్ చైర్‌లు అందజేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అఖండ విజయం చేకూర్చాలని కోరారు.

సాయుధ బలగాల కవాతు



యడవల్లిలో కవాతు

చిలకలూరిపేటటౌన్: ఎన్నికలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.నారదముని పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని యడవల్లి, పోతవరం, కమ్మవారిపాలెం, కట్టుబడివారిపాలెం గ్రామాల్లో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ కవాతులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఓటరు ధైర్యంగా ఓటు వేసేలా చైతన్యం కలిగిస్తున్నట్లు చెప్పారు. ఓటరు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. నరసరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లను గుర్తించి, తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలో హింసాత్మక చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి, బైండోవర్ చేస్తున్నట్లు వివరించారు. కవాతులో ట్రైనీ డీఎస్పీ బి.జగదీష్, రూరల్ సీఐ పి.శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు జి.రవికృష్ణ, వి.బాలకృష్ణ పాల్గొన్నారు.

వినుకొండ అభివృద్ధి ఎమ్మెల్యే బొల్లాతోనే సాధ్యం



ప్రచారంలో బొల్లా గిరిబాబు

వినుకొండ (నూజెండ్ల): వినుకొండ అభివృద్ధి ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుతోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ యువజన నాయకులు, ఎమ్మెల్యే బొల్లా తనయుడు బొల్లా గిరిబాబు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కోసం ఆయన ఆదివారం పట్టణంలోని 1వ వార్డులో ఎన్నికల ప్రచారం చేశారు. పట్టణ తాగునీటి సమస్య పరిష్కరించడమే కాకుండా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అటువంటి నాయకుడిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎమ్మెల్యేగా బొల్లా బ్రహ్మనాయుడును, ఎంపీగా అనిల్‌కుమార్‌యాదవ్‌ను గెలిపించుకోవలసిన అవసరం ఉందని, వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.